అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 323 | వరంగల్ | గురువారం, 01 అక్టోబర్ 2026 | పేజీలు: 06



- సిబ్బందిపై ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ దాడులు
- జీతం అడిగినా, ప్రశ్నించినా కొట్టుడే
- ఇటీవల ఓ హాస్పిటల్ గార్డుపై దాష్టీకం
- కారులో తిప్పుకుంటూ దాడి, పైగా కేసు నమోదు?
- హద్దులు దాటుతున్న రంజిత్తులమారి ఆగడాలు



ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ ఎస్4ఎస్ గూండాగిరి చేస్తోంది. సిబ్బందిపై రౌడీయిజం ప్రదర్శిస్తోంది. జీతం అడిగినా.. ప్రశ్నించినా.. కక్షగట్టి దాడులు చేస్తోంది. పైగా, బాధితులపైనే కేసులు కూడా బనాయిస్తూ దందా చేస్తోంది. ఇటీవల సదరు ఏజెన్సీ కింద ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న గార్డుపై దారుణంగా దాడికి పాల్పడింది. కక్షగట్టి, లేనిపోని ఆరోపణలు చేస్తూ.. కారులో తిప్పుకుంటూ కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరిగి.. బాధిత సిబ్బందిపైనే కేసు నమోదు చేయించిన రంజిత్తులమారి దందాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. అయినా.. నిబంధనలు పాటించకున్నా.. ఏజెన్సీని రెన్యువల్ చేయించకున్నా.. కేవలం అతికొద్ది సిబ్బంది పరిమితితో జిల్లా కార్మిక శాఖలో రిజిస్ట్రేషన్ పొంది, వందలమందిని నియమించుకొని, దారుణంగా దోపిడీ చేస్తున్నా.. చివరకు ఏజెన్సీని రెన్యూవల్ చేయించకుండా దందా చేస్తున్నట్లు బలమైన ఆరోపణలు వస్తున్నా.. సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. – అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి

4 S4S రౌడీయిజం

మా ఆస్తులు, మీ ఆస్తులపై విచారణకు సిద్ధం..

సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్

అక్షరశక్తి, హైదరాబాద్: ఆస్తుల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. 'మా ఆస్తులు, మీ ఆస్తులపై విచారణకు సిద్ధం' అని స్పష్టం చేశారు. రేవంత్ సోదరులకు రూ.1,000 కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నిస్తూ.. దీనిపై సిట్టింగ్ జడ్జికి లేఖ రాసేందుకు సిద్ధమా అంటూ ఛాలెంజ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. 'మిమ్మల్ని వదలం.. హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటాం. మా తాతకు చింతమడకలో వందల ఎకరాలు ఉండేవి. ఇందుకు సంబంధించిన వివరాలు కూడా సీఎంకు పంపిస్తా' అని కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నో అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు బాధలో ఉన్నారని.. వారికి 6 గంటల కరెంట్ కూడా రావడం లేదని తెలిపారు. మోసపోతే గోసపడతారని కేసీఆర్ ఎప్పుడో చెప్పారని గుర్తుచేశారు. పాత రోజులు మళ్లీ తీసుకొస్తామని రేవంత్ చెప్పారని.. చెప్పినట్టే ఇబ్బందులు ఉన్న పాత రోజులు తెచ్చారని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం, కరెంట్ కొనుగోళ్లపై కమిషన్లు తుస్సుమన్నాయని అన్నారు. ఫార్ములా ఈపై కేసు పెట్టారని.. ఏం తేల్చారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి బాధ ఏంటో ఎవరికీ అర్థంకావడం లేదని మాజీ మంత్రి అన్నారు. కాంగ్రెస్ పాలనలో సిరిసిల్లలో 35 మంది నేత కార్మికులు చనిపోయారన్నారు. సీఎం రేవంత్ వారిని ఆదుకుంటారని అనుకున్నామని.. రూ.10 లక్షల నష్టపరిహారం ప్రకటిస్తారని ఆశించామని తెలిపారు. శత్రుదేశం మీదకు దండయాత్రకు వెళ్లినట్టు సిరిసిల్లకు వెళ్లారని విమర్శించారు. సీఎం రేవంత్ పర్యటనలో పోలీసులు తప్ప ప్రజలు లేరంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు.



ఆరవ వసంతంలోకి అక్షరశక్తి...

- ప్రజా సమస్యలపైనే మా పోరాటం
- మార్పు ప్రయత్నంలో మా శక్తి అక్షరమే
- నిఖార్సైన జర్నలిజానికి మేము ఒక బ్రాండ్

మనకు మనంగా బతకడంలో గొప్పదనం ఏం ఉంటుంది. మనతో పాటు మన సమాజం కూడా బాగుండాలని అనుకోవడంలో మన వ్యక్తిత్వం తెలుస్తుంది. సమాజానికి ఏదో ఒకటి చెయ్యాలని ఆశించే వాళ్ళలో మేము ఎల్లప్పుడూ ముందుంటాం. ఒక సైనికుడు యుద్ధం చేయాలంటే కత్తికి పదును ఉండాలి. ఎల్లవేళలా అక్షరమే ఆయుధంగా ప్రజాహితం కోసం పోరాడటంలో మా కలానికి కూడా పదును ఉంటుంది. మా వార్త వల్ల ఎవరికైనా న్యాయం జరిగితే కలిగే సంతృప్తికి ఎవరూ వెలకట్టలేరు. ఈ క్రమంలో ప్రతీ రోజు ఒక కొత్త అన్వేషణ.. ఒక దశలో సైనికుడు యుద్ధం ఆపేస్తాడేమో కానీ అక్షర సైనికుడు అలసిపోని యుద్ధం చెయ్యాల్సిందే.



ఇప్పుడు మేము గత ఐదేళ్లుగా అక్షరాన్నే శక్తిగా మార్చుకొని, విలువల సంప్రదాయాన్ని మర్చిపోకుండా జర్నలిస్ట్‌గా సమాజ నిర్మాణంలో ఒక చిన్న ఇటుకలుగా నిలబడ్డాము. 2021 అక్టోబర్ 2న మొదలైన ఈ ప్రయాణంలో ఎన్నో అవమానాలు, ఆర్థిక సమస్యల అడ్డుగోడలు దాటి ఆరవ వసంతంలోకి అడుగుపెడుతున్నాం. నిఖార్సైన జర్నలిజాన్ని నమ్ముకొని రాసిన వార్తలతో అక్షరశక్తిని ఒక బ్రాండ్ గా నిలబెట్టాం. ల్యాండ్ పూలింగ్, ల్యాండ్ కబ్జా, ఆజంజాహిమిల్లు కార్మిక భవనం, అవినీతి మురికి అంటుకున్న అధికారులు, రాజకీయ నాయకులు, వ్యవస్థలో పాతుకుపోయిన సమస్యల పరిష్కారానికి అక్షర నిర్దేశం చేశాం. సక్సెస్ సాధించిన సగటు మనుషుల జీవితాలను అక్షరబద్ధం చేశాం. సవాళ్లను స్వీకరించడం, ముందుకు అడుగులు వేయడమే అక్షరశక్తి సక్సెస్ సూత్రం. ఈ ప్రయాణంలో మా వెంట నడిచిన జర్నలిస్టులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు అక్షరశక్తి ఆరవ వసంతోత్సవ శుభాకాంక్షలు.

మీ
- డా. పల్లె రవి వంశీ మోహన్
ఎడిటర్ & ఏండీ, అక్షరశక్తి



వ్యక్తిత్వ వికాసమే అభివృద్ధికి మూలం
వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవడం ద్వారా మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవచ్చని, వ్యక్తిత్వ వికాసమే విద్య, ఉద్యోగం, సామాజిక సేవతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధికి పునాది అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, IPS తెలిపారు. గురువారం పింగిలి ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన నేషనల్ సర్వీస్ స్కీమ్ (NSS) దిశానిర్దేశక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ, NSS ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను సద్వినియోగం చేసుకుంటూ, సమాజానికి ఉపయోగపడే NSS వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి, NSS ప్రోగ్రామ్ అధికారులు, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయండి



అక్షరశక్తి, హనుమకొండ: శ్రీ సాయి మీరా కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 19న నిర్వహించే సిల్వర్ జూబ్లీ వేడుకలను విజయవంతం చేయాలని సాయిబాబా మందిర చైర్మన్ హరగోపాల్ శర్మ కోరారు. గురువారం హనుమకొండ శ్రీదేవి ఏషియన్ మాల్ ప్రాంతంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో శ్రీ సాయి మీరా కల్చరల్ సొసైటీ సిల్వర్ జూబ్లీ వేడుకల కరపత్రాన్ని సాయిబాబా పాదాల చెంత పెట్టి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందిర చైర్మన్ మతుకు మల్లి హరగోపాల్ శర్మ, శ్రీ సాయి మీరా కల్చరల్ సొసైటీ వ్యవస్థాపకులు,చైర్మన్ కర్ణకంటి పోతనాచారి విశ్వకర్మ మాట్లాడుతూ శ్రీ సాయి మీరా కల్చరల్ సొసైటీ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంలో డిసెంబర్ 19న హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించే సిల్వర్ జూబ్లీ మహోత్సవాలను ఆదరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలలో భారతీయ శాస్త్రీయ సంగీత కచేరి, శాస్త్రీయ నృత్యాలు, బోనాలు, బతుకమ్మ ఆటలు,తెలంగాణ జానపద గేయ కళారూపాలు, విశ్వంభర కవుల సమ్మేళనం, సరిగమప సినీ సంగీత లహరి,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి పరిమళాలు, కాకతీయ కళాభైపోవపు వెలుగులు, భారతీయ శాస్త్రీయ కళల మధుర సమ్మేళనంగా సాగే ఈ అపూర్వ సాంస్కృతిక మహోత్సవానికి కవులు,కళాకారులు, సంగీత ప్రియులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మందిర ధర్మకర్త నిమ్మల శ్రీనివాస్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా కోశాధికారి డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్ , వాణిశ్రీ, పద్మజా రెడ్డి, జయశ్రీ, శ్రీమన్నారాయణ, సుధాకర్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దారి కబ్జాపై చర్యలు తీసుకోవాలి



అక్షరశక్తి, చిట్యాల: వెంచరామి గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు వెళ్లే దారిని కొందరు కబ్జా చేయడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. గురువారం ఆయన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి చెందిన దారిని కబ్జా చేసిన వారిపై అధికారులు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుని, సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి దారిని పరిశీలించి, నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పీఎం కుసుమ్‌ఏలో 100 మెగావాట్ల మైలురాయి

- ఎన్పీడీసీఎల్ రికార్డు
- 18 సర్కిళ్లలో సౌర విద్యుత్ విస్తరణ..
- 3-4 నెలల్లో 300 మెగావాట్ల లక్ష్యం



అక్షరశక్తి, వరంగల్: పునరుత్పాదక ఇంధన రంగంలో టీజీ ఎన్పీడీసీఎల్ మరో కీలక మైలురాయిని సాధించింది. పీఎం కుసుమ్‌ఏ పథకం కింద సంస్థ పరిధిలోని 18 సర్కిళ్లలో కలిపి 100 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించినట్లు సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. రైతుల భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తితో పాటు రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు కల్పించడమే పీఎం కుసుమ్‌ఏ పథకం ప్రధాన ఉద్దేశమని సీఎండీ పేర్కొన్నారు. రైతులు తమ భూముల్లో సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసే అవకాశం ఉందన్నారు. దీనివల్ల రైతుల ఆర్థిక సాధికారతతో పాటు స్థానికంగా పునరుత్పాదక విద్యుత్ లభ్యత పెరుగుతుందని తెలిపారు.

18 సర్కిళ్లలో పథకం అమలుకు కృషి చేసిన అధికారులు, ఇంజినీర్లు, సిబ్బందిని కర్నాటి వరుణ్ రెడ్డి అభినందించారు. సౌర విద్యుత్ సామర్థ్యాన్ని మరింత వేగంగా పెంచేందుకు చర్యలు కొనసాగించాలని సూచించారు.

ప్రస్తుతం మరో 200 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యం వివిధ దశల్లో ఉందని, రానున్న మూడు నుంచి నాలుగు నెలల్లో మొత్తం 300 మెగావాట్ల సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎండీ తెలిపారు. సౌర విద్యుత్ విస్తరణ ద్వారా రైతులకు అదనపు ఆదాయం, వినియోగదారులకు పర్యావరణహిత విద్యుత్, సంస్థకు పునరుత్పాదక ఇంధన సామర్థ్య విస్తరణ వంటి ప్రయోజనాలు కలుగుతాయని ఆయన పేర్కొన్నారు.





వెంచరామిలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

అక్షరశక్తి, చిట్యాల: చిట్యాల మండలం వెంచరామి గ్రామ పంచాయతీ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. స్థానిక సర్పంచ్ కాసురమా కుమార్ నాయకత్వంలో జరిగిన కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జక్కే వెంకటేశం, మోరే ధర్మరాజు, కళ్లేపల్లి సదయ్య, చేటుకూరి అశోక్, గుర్రం అయిలయ్య, యూత్ ఉపాధ్యక్షుడు తిప్పన శివ, ఆశాడపు మల్లయ్య, పరికిపండ్ల సమ్మయ్య, పరికిపండ్ల సాగర్, పరికిపండ్ల సంతోష్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో రైతులు, ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలయ్యాయని అన్నారు. ప్రస్తుతం రైతులు విద్యుత్ సరఫరా, ఎరువుల లభ్యత తదితర సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మాటలు చెప్పడం కాకుండా ఇచ్చిన హామీలను అమలు చేసి చూపించాలని, కేసీఆర్ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వెంచరామి నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. వారి చేరికతో చిట్యాల మండలంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని పేర్కొంటూ, రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో, రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ప్రజల నుంచి మరింత మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వైఎస్ఆర్ నగర్ గుడిసెవాసులకు న్యాయం చేయాలి

అక్షరశక్తి,కాజీపేట: వైఎస్ఆర్ నగర్‌లో సుమారు 22 ఏళ్లుగా నివసిస్తున్న పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైఎస్ఆర్ నగర్ వీకర్ సెక్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు పసనూరి మనోహర్ నాయకత్వంలో జరిగిన ర్యాలీని హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అంకుస్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబర్లు 69, 70, 71, 72, 73 పరిధిలోని భూమిలో సుమారు వెయ్యి కుటుంబాలు ఏళ్లుగా నివసిస్తున్నాయని, వారికి ఆధార్, రేషన్, ఓటర్ గుర్తింపు కార్డులు, ఇంటి నంబర్లు తదితర ప్రభుత్వ గుర్తింపు పత్రాలు ఉన్నాయని తెలిపారు. గత మూడు నెలలుగా కొందరు భూ కబ్జాదారులు పేదలను భయభ్రాంతులకు గురిచేస్తూ గుడిసెలను తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పేదలకు పట్టాలు, ఇళ్లు మంజూరు చేసి అదే ప్రాంతంలో



పునరావాసం కల్పించాలని వారు కోరారు. స్థిర నివాస స్థలాలు లేని పేదలకు ప్రభుత్వం భూమి సమకూర్చి లేదా అవసరమైతే భూమి కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరినట్లు తెలిపారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. పేదల గుడిసెలను తొలగించే ప్రయత్నాలను విరమించుకోవాలని, లేనిపక్షంలో చట్టపరంగా, రాజ్యాంగబద్ధంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ర్యాలీలో ఎర్ర రామకృష్ణ, కొలిపాక బిక్షపతి, గుమ్ముల రవి, రావుల దయాసాగర్, బన్న సాంబయ్య, శనగరపు సతీష్, మహమ్మద్ యాసిన్, రజాక్, పాష, రషీద్, గౌతం, అర్జున్ సాయి, నీరటి పావని, కాదాసీ సులోచన, శనగరపు లక్ష్మి, భవాని, అభిజ్ఞ, సునీత, నీరటి పుష్ప తదితరులు పాల్గొన్నారు.



పకడ్బందీగా ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ నిర్వహించాలి

- తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికలఅధికారి సి.సుదర్శన్ రెడ్డి
- ఓటర్లను కార్యాలయాలకు పిలిచి నోటీసులు, పత్రాల స్వీకరణ చేయొద్దు
- బి.ఎల్.ఓ.లు నోటీసులు అందజేసి, పత్రాలను ఇంటి వద్దే స్వీకరించాలి
- ఫారం-6, 7, 8 పెండింగ్, పరిష్కార వివరాలను రాజకీయ పార్టీలకు అందించాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఈఓ



అక్షరశక్తి, హన్మకొండ : ఎస్ఐఆర్2026 ప్రక్రియను భారత ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్లను నోటీసులు అందుకోవడానికి లేదా అవసరమైన పత్రాలు సమర్పించడానికి కార్యాలయాలకు పిలవరాదని స్పష్టం చేశారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను వారి ఇళ్ల వద్దే స్వీకరించాలని సూచించారు.

ఇకపై సాధారణంగా ఓటర్లను విచారణ (హియరింగ్) కోసం కార్యాలయాలకు పిలవరాదని సీఈఓ తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో విచారణ నిర్వహించాల్సి వస్తే ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఫారం-6 డిక్లరేషన్ తప్పనిసరి

కొత్త ఓటరు నమోదు కోసం ఫారం6 సమర్పించే సమయంలో డిక్లరేషన్ తప్పనిసరిగా ఉండాలని సీఈఓ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ నిర్వహించని రాష్ట్రాల్లో డిక్లరేషన్ అవసరం లేకపోయినప్పటికీ, తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు సందర్భంగా డిక్లరేషన్ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈఆర్ఓ కార్యాలయాల నోటీసు బోర్డులపై ఫారం 6, ఫారం7కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల సంఖ్య, పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ఓటర్లకు జారీ చేయాల్సిన పెండింగ్ నోటీసులపై కూడా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ఫారం6, పెండింగ్ నోటీసులు, ఫారం7, ఫారం8కు సంబంధించిన వివరాలను అన్ని స్థాయిల్లోని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందించాలని సీఈఓ ఆదేశించారు. ఎస్ఐఆర్2026 ప్రక్రియలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేస్తూ, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దశను పారదర్శకంగా పూర్తి చేయాలని సీఈఓ సి. సుదర్శన్ రెడ్డి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఆర్డీవో వెంకటేష్, తహసీల్దార్ రవీందర్,ఎ లక్షన్ సూపరింటెండెంట్ జగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు

మాదిగలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలి

అక్షరశక్తి, ఆత్మకూరు, అక్టోబర్ 1: మాదిగ సామాజిక వర్గానికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు మండలం నాగయ్యపల్లిలో ఆయన మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో కనీసం ఒక స్థానాన్ని మాదిగలకు కేటాయిస్తారని ఆశించినా అవకాశం దక్కలేదన్నారు. డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ విద్యావంతుడు, రాజకీయ అనుభవం ఉన్న నాయకుడని, ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేస్తున్నారని మాదాసి సురేష్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉన్న కుటుంబానికి చెందిన రామకృష్ణ చాలాకాలంగా పార్టీలో పనిచేస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని పేర్కొన్నారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా రామకృష్ణకు అవకాశం వస్తుందని ఆశించినా దక్కలేదన్నారు. గవర్నర్ కోటాలో ఆయనకు ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తే సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల కోసం మరింత విస్తృతంగా పనిచేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో డీపీఎఫ్ జిల్లా కార్యదర్శి మాదాసి సుదర్శన్, ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు బాగాజీ రజనీకాంత్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మాదాసి ప్రభాకర్ మాదిగ, మాజీ ఉపసర్పంచి సంగి యాకయ్య, మాజీ వార్డు సభ్యులు మాదాసి అశోక్, బోడళ్ల సాంబయ్య, ధర్మసమాజ్ పార్టీ జిల్లా కార్యదర్శి డాక్టర్ సుధాకర్, ప్రజాసంఘాల నాయకులు గుండాల రాజలింగం, మాదాసి బిక్షపతి, మాదాసి సారయ్య, మాదాసి కట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలు

అక్షరశక్తి, హనుమకొండ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవాలు హనుమకొండ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో ఘనంగా నిర్వహించినట్లు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 28న నిర్వహించిన భారీ విద్యార్థి ర్యాలీ చర్చనీయాంశంగా నిలిచిందని, 29, 30 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ 90 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం, పోరాటాలు, విజయాలతో పాటు విద్యారంగ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. 30న జరిగిన రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో నూతన రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కమిటీని ఎన్నుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శిగా పుట్ట లక్ష్మణ్ మరోసారి ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇటికాల రామకృష్ణ, కార్యనిర్వహక కార్యదర్శిగా రెహమాన్, ఉపాధ్యక్షులుగా బానోత్ రఘురాంనాయక్, లెనిన్, ముదిగొండ మురళీకృష్ణ, బలుముల ప్రేమ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా భాషబోయిన సంతోష్, నెల్లి సత్య, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, జేరిపోతుల జనార్ధన్ ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా మణికంఠరెడ్డి, లక్ష్మణ్ మాట్లాడుతూ వార్షికోత్సవాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకున్నట్లు తెలిపారు. విద్యారంగ ప్రైవేటీకరణ, కాషాయీకరణకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు. తెలంగాణ విభజన హామీల ప్రకారం రాష్ట్రానికి కేటాయించాల్సిన విద్యాసంస్థలను కేటాయించడంలో కేంద్రం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని, విద్యకు అధిక నిధులు కేటాయించాలని, ప్రభుత్వ విద్యబలోపేతానికి భవిష్యత్‌లో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.



ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్

సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌లో నలుగురికి ఉద్యోగాలు



అక్షరశక్తి, కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన నలుగురు చివరి సంవత్సరం విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జూనియర్ మెకానికల్ డిజైన్ ఇంజినీర్ హోదాలో ఎంపికైన ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.3.6 లక్షల వేతన ప్యాకేజీ లభించనుంది. ఎంపికైన విద్యార్థుల్లో పి. వర్ధన్, టి. శివ సాయి సింహ, పి. పవన్ కుమార్, భార్గవి ఉన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ విద్యార్థులను అభినందించారు. సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్. రాధిక, శిక్షణ, నియామకాల అధికారి డాక్టర్ పి. సంతోష్ కుమార్ విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు నిరసనగా ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు



అక్షరశక్తి,హనుమకొండ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు నిరసనగా గురువారం హనుమకొండ జిల్లాలోని రామాలయం, శివాలయాలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి బుద్ధిని ప్రసాదించాలని దేవుళ్లను వేడుకున్నారు. హనుమకొండ జిల్లా కన్వీనర్ రచ్చ బాలు, నాగిళ్ల వేణుశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లలిత్ కిషోర్, మచ్చ కిరణ్, దేవరకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

జాల శ్రీలక్ష్మికి ఇంగ్లీషులో పీహెచ్‌డీ.



అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ ఇంగ్లీష్ విభాగం పరిశోధకురాలు జాల శ్రీలక్ష్మి కి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్.డీ.) ఇన్ ఇంగ్లీష్ ప్రదానం చేసినట్లు కాకతీయ విశ్వవిద్యాలయ పరీక్ష నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ తెలిపారు. జాల శ్రీలక్ష్మి కాకతీయ విశ్వవిద్యాలయ ఇంగ్లీష్ విభాగాధిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఆర్. మేఘనా రావు పర్యవేక్షణలో కల్చరల్ డిస్‌ప్లేస్‌మెంట్స్ అండ్ హైబ్రిడిజం ఇన్ రైటింగ్స్ ఆఫ్ చేతన్ భగత్ అనే అంశంపై చేసిన పరిశోధనగాను పీహెచ్డీని ప్రదానం చేశారు. ఎంఏ ఆంగ్ల సాహిత్యాన్ని మరియు ఎమ్మెల్సీ సైకాలజీని, ఎం ఎస్ సి యోగా, మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఏం పిల్ ని పూర్తి చేసి చేసింది. 20 సంవత్సరాల బోధన అనుభవం ఉంది. విద్యాసంస్థలలో మోటివేషనల్ స్పీకర్ గా, వ్యక్తిత్వ వికాసానికి యోగా కార్యక్రమాలు నిర్వహించడం తోపాటు అనేక ప్రసంగాలు కూడా ఇవ్వడం జరిగింది. జాల శ్రీలక్ష్మి ప్రస్తుతం కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. పీహెచ్డీ పూర్తి చేసిన సందర్భంగా పరిశోధన విద్యార్థులు అభినందించారు.

స్వచ్ఛతపై లాల్‌బహదూర్ కళాశాల ఎన్‌సీసీ అవగాహన



అక్షరశక్తి, వరంగల్: స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా లాల్‌బహదూర్ కళాశాల ఎన్‌సీసీ ఆధ్వర్యంలో 'ఏక్ సాత్ ఏక్ గంట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డి.హెచ్.రావు తెలిపారు. ఎన్‌సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో కళాశాల పరిసరాల్లో, ములుగు రోడ్డు జంక్షన్‌లోని లాల్‌బహదూర్ శాస్త్రి, జ్యోతిరావు పూలే విగ్రహాల వద్ద శుభ్రత కార్యక్రమం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ప్రిన్సిపాల్ సూచించారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని పరిశుభ్రత ద్వారా నివాళి అర్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఎన్‌సీసీ 10వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ ఎస్.ఎస్.రామదురై, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రవిసునారే ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, కేడెట్లు రశ్మిత, గోకుల్, శిరీష, అనూష, హేమంత్, రాకేష్, రియాన్, మహేష్, స్వాతి, మహేశ్వరి, శారద, కుషల్, మోక్షజ్ఞ, రిత్విక్‌సాయి, కార్తీక్, అక్షయ, అశోక్, రక్షిత్ పాల్గొన్నారు.

మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సౌర విద్యుత్‌పై అవగాహన



అక్షరశక్తి, వరంగల్: కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్‌లో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో సౌర విద్యుత్ సాంకేతికత, తాజా ఆవిష్కరణలు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సౌర విద్యుత్ సాంకేతిక నిపుణులు డా. బి. శివకుమార్ ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. సౌర విద్యుత్ రంగంలో వస్తున్న సాంకేతిక పరిణామాలు, ఆధునిక సోలార్ పవర్ టెక్నాలజీలు, పునరుత్పాదక ఇంధన రంగంలో భవిష్యత్ అవకాశాలు, ఇంజినీరింగ్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న కెరీర్ అవకాశాలను వివరించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు, ప్రాక్టికల్ నాలెడ్జ్, నిరంతర అభ్యాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. బిక్షాలు, ఈఈఈ విభాగం ఇన్‌చార్జి తూర్పాటి వెంకటేష్, అధ్యాపకులు ఎస్. సాహితి, యశస్విని తదితరులు పాల్గొన్నారు. ఈఈఈ విభాగ విద్యార్థులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

21 కుటుంబాలకు కోళ్ల పంపిణీ



అక్షరశక్తి, యాదాద్రిభువనగిరి: నాబార్డు ఆర్థిక సహకారంతో తుర్కపల్లి మండలం చిన్నక్కాపూర్ వాటర్‌షెడ్ పరిధిలోని చిన్నక్కాపూర్, పొట్టిమర్రి తండా గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు కోళ్లను పంపిణీ చేశారు. చిన్నక్కాపూర్ వాటర్‌షెడ్ కమిటీ ఆధ్వర్యంలో మారీ సంస్థ సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కోళ్ల పెంపకం ద్వారా లబ్ధిదారులు అదనపు ఆదాయం పొందడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కోళ్ల పెంపకానికి అనువుగా నైట్ షెల్టర్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ కమిటీ అధ్యక్షుడు దూబల నర్సింహారెడ్డి, కమిటీ సభ్యులు దూబల రామ్‌రెడ్డి, మేడిపల్లి రాజు, మహేందర్‌రెడ్డి దుబాల, గోపనబోయిన ఐలమ్మ, గోపనబోయిన కొమురయ్య, నరిగె లక్ష్మి, బాలమ్మ, రమావత్ సరిత, దిరావత్ జగన్, మూడావత్ చిన్నా, వార్డు సభ్యుడు నరేష్, మారీ సంస్థ ప్రాజెక్టు అధికారులు వెంకట్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

S4S రౌడీయిజం

- **సిబ్బందిపై ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ దాడులు**
- **జీతం అడిగినా, ప్రశ్నించినా కొట్టుడే**
- **ఇటీవల ఓ హాస్పిటల్ గార్డుపై దాష్టీకం**
- **కారులో తిప్పుకుంటూ దాడి, పైగా కేసు నమోదు?**
- **హద్దులు దాటుతున్న రంజిత్తులమారి ఆగడాలు**



అక్షరశక్తి, ప్రధాన ప్రతినిధి: ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ ఎస్4ఎస్ గూండాగిరి చేస్తోంది. సిబ్బందిపై రౌడీయిజం ప్రదర్శిస్తోంది. జీతం అడిగినా.. ప్రశ్నించినా.. కక్షగట్టి దాడులు చేస్తోంది. పైగా, బాధితుల పైనే కేసులు కూడా బనాయిస్తూ దందా చేస్తోంది. ఇటీవల సదరు ఏజెన్సీ కింద ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న గార్డుపై దారుణంగా దాడికి పాల్పడింది. కక్షగట్టి, లేనిపోని ఆరోపణలు చేస్తూ.. కారులో తిప్పుకుంటూ కొట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరిగి.. బాధిత సిబ్బందిపైనే కేసు నమోదు చేయించిన రంజిత్తులమారి దందాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. అయినా.. నిబంధనలు పాటించకున్నా.. ఏజెన్సీని రెన్యువల్ చేయించకున్నా.. కేవలం అతికొద్ది సిబ్బంది పరిమితితో జిల్లా కార్మిక శాఖలో రిజిస్ట్రేషన్ పొంది, వందలమందిని నియమించుకొని, దారుణంగా దోపిడీ చేస్తున్నా.. చివరకు ఏజెన్సీని రెన్యూవల్ చేయించకుండా దందా చేస్తున్నట్లు బలమైన ఆరోపణలు వస్తున్నా.. సంబంధిత అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

గార్డులను అతిహీనంగా చూస్తూ...

సెక్యూరిటీ గార్డుల జీవితాలతో ఆడుకుంటున్న S4S ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ ప్రతినిధుల మరో కోణం బహిర్గతం అయింది. జీతాలు తక్కువ ఇస్తూ, వారి చెమటను దోచుకోవడం తోనే ఆగలేదు. గార్డులను అతి హీనంగా చూస్తూ, హక్కులు అడిగితే ఉద్యోగం పీకేయడం, ఎదురు మాట్లాడితే చితకబాదడం వారి నైజం. మానవహక్కులు ఎగతాళి చేసేలా ఒక గార్డును కారులో తిప్పుతూ తీవ్రంగా కొట్టడం వరంగల్ నగరంలో సంచలనంగా మారింది. నిజంగా తాను తప్పు చేస్తే.. పీఎస్‌లో అప్పగించాల్సింది పోయి.. తనను అకారణంగా కొడుతూ.. తిడుతూ.. తిప్పారని, మరో ఏజెన్సీ నుంచి ఇందులోకి ఎందుకొచ్చావురా..అంటూ తిట్టారని తెలుస్తోంది. S4Sలో ఒక గూండాగిరి బ్యాచ్‌ను రంజిత్తులమారి మేపుతూ ఈ ఆగడాలకు పాల్పడుతున్నాడని, దీనికి కొంత మంది పోలీసులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొట్టడానికో బ్యాచ్...

మాకు ఈపీఎఫ్, ఈఎస్ఐ కూడా కట్టడం లేదు... కనీసం జీతం అయినా సరిగా ఇవ్వండి అని అడిగడమే వారు చేసిన మహాపాపం. మాట్లాడుదాం.. అని, ఇంటికి రమ్మని పిలిచి, కొట్టాడని కొందరు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ బాధితులు పోసులకు ఫిర్యాదు చెయ్యడానికి భయపడుతున్నారు. వారితో పెట్టుకుంటే ఉన్న ఉద్యోగం కూడా పోతుందని అంటున్నారు. ఇదే బలహీనత చూసుకొని చాలా మంది గార్డులను ఏజెన్సీ నిర్వాహకులు రంజిత్తులమారి మోసం చేస్తున్నాడని ఆరోపిస్తున్నారు. దీనికి కొంత మంది పోలీసుల పేరు చెప్పి రంజిత్తులమారి బెదిరింపులకు పాల్పడుతున్నాడని సమాచారం. కార్మికుల శ్రమ దోపిడీ, బెదిరించడం, కొట్టడంలో ఈ బ్యాచ్ ఆరితేరింది. ఐతే కొన్ని విషయాలు పోలీసులకు తెలిసినా చర్యలు తీసుకోలేదని తెలుస్తున్నది. వీరికి మట్టేవాడ, సుబేదారి, హన్మకొండ పోలీస్ స్టేషన్‌లలో కొందరు పోలీసుల సహకారం ఉందని, దీనితో ఇష్టారాజ్యంగా దాడులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

గార్డుపై దాష్టీకం...

వరంగల్ నగరంలో ఒక "వెల్" నోటెడ్ ఆసుపత్రిలో జరిగిన ఘటన దిగజారిన సామాన్య మానవుని హక్కుల ఘటనగా మిగిలిపోతుంది. గత శనివారం ఒక ఆసుపత్రిలో సూపర్వైజర్ గా పని చేస్తున్న సెక్యూరిటీ గార్డ్ ఆసుపత్రి ఆయమ్మతో అమర్యాదగా ప్రవర్తించాడని, దూషించాడని ఆరోపిస్తూ.. గార్డ్ పై సదరు ఏజెన్సీ గూండాగిరి బ్యాచ్ దాడికి పాల్పడింది. అమానవీయంగా ప్రవర్తించింది. సదరు గార్డ్ ను కారులో తిప్పుతూ మూడు గంటల పాటు నరకం చూపించారు. పైగా బూతుల పురాణం విప్పారు. దాహం వేస్తున్నా నీళ్ళు ఇవ్వకుండా దారుణంగా హింసించారని తెలిసింది. వారు కొట్టిన దెబ్బలకు గార్డ్ చెయ్యి విరిగింది. హన్మకొండ అదాలత్, సుబేదారి ప్రాంతంలో తిప్పుతూ మాటలతో, చేతలతో హింసించారు అని తెలిసింది. పైగా పోలీసులు అంతా మనవాళ్ళే....నేను చూసుకుంటా అని రంజిత్తులమారి అభయం ఇస్తున్నాడట. పైగా, మట్టేవాడ పోలీస్ స్టేషన్ లో కేసు కూడా నమోదు చేయించినట్లు సమాచారం.

ఉత్తమ టీచర్ కృష్ణవేణికి ఘన సన్మానం



అక్షరశక్తి, వరంగల్: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఆచార్య జానపా రెడ్డి కృష్ణవేణికి రోటరీ క్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో 'బెస్ట్ టీచర్ అండ్ నేషన్ బిల్డర్' అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఫార్మసీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆమెను పుష్పగుచ్ఛం, శాలువాతో ఘనంగా సత్కరించారు. కృష్ణవేణి తన తండ్రి దివంగత చక్రపాణి స్ఫూర్తితో విద్యారంగంలో సేవలందిస్తున్నారని అధ్యాపకులు తెలిపారు. 1997 డిసెంబర్ 10న ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టి, అనంతరం కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలలో ఆచార్యురాలిగా సేవలందించారని పేర్కొన్నారు. బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, పీహెచ్‌డీ విద్యార్థులకు బోధించడంతో పాటు అనేక మంది విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. అమెరికాలో సీవీ రామన్ ఫెలోషిప్ పూర్తి చేసిన కృష్ణవేణి నానోటెక్నాలజీ ఫార్ములేషన్, నాసల్ డ్రగ్ డెలివరీ, బుక్కల్ డెలివరీ సిస్టమ్స్‌పై పరిశోధనలు చేస్తున్నారు. ఆమె పర్యవేక్షణలో ఐదుగురు విద్యార్థులు పీహెచ్‌డీ పూర్తి చేయగా, మరో నలుగురు పరిశోధనలు కొనసాగిస్తున్నారు. 100 మందికి పైగా ఎం.ఫార్మసీ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించగా, జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో సుమారు 50 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. గతంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, హాస్టల్ జాయింట్ డైరెక్టర్, హెల్త్ సెంటర్ ఇన్‌చార్జిగా సేవలందించారు. కార్యక్రమంలో వై. నరసింహారెడ్డి, గాదె సమ్మయ్య, సునీత, ప్రియాంక తదితర అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని కృష్ణవేణికి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనపూర్ డిగ్రీ కాలేజీకి భూమిపూజ



అక్షరశక్తి, స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 1: స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రాష్ట్రస్థాయి లో ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కళాశాల భవన నిర్మాణానికి నిర్వహించిన భూ మిపూజలో పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరిం చారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో కళాశాల ను మంజూరు చేయించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. 2025 మార్చి 22న జారీ చేసిన జీవో నెం.48 ద్వారా రూ.8.60 కోట్ల నిధులు మంజూర య్యాయని, ఇందులో రూ.2.50 కోట్లు ఉద్యోగుల జీతాలు, ఇతర అవసరాలకు, రూ.6.10 కోట్లు భవన నిర్మాణానికి కేటాయించినట్లు వివరించారు. 2027 ఆగస్టు 1 నాటికి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశిం చారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా మొదటి, రెండో అంతస్తుల నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

కళాశాలలో ల్యాబొరేటరీలు, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని అన్నారు. డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.23 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.9.90 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైనట్లు పేర్కొన్నా రు. చిల్పూర్‌కు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ కూడా మంజూరైందన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, కళాశాల ప్రిన్సి పాల్ చంద్రమౌళి, ఈఈ అరుణ్, వైస్ చైర్మన్ నీల రాజమ్మ, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సైలెన్సర్ల ధ్వంసం







రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేసిన ట్రాఫిక్ పోలీసులు

అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్: వరంగల్ పోలీస్ కమిష నర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర రావు గారి ఆధ్వర్యం లో ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ మరియు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది గురువారం వరంగల్ నగరంలో ని పోచమ్మ మైదాన్ సర్కిల్ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వాహనాలకు కంపెనీ నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసి అమర్చిన, అధిక శబ్దాన్ని వె లువరించే సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు తనిఖీల సంద ర్భంగా తొలగించి స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా స్వాధీనం చేసుకున్న సుమారు 350 మార్పు చేసిన సైలె న్సర్లను రోడ్డు రోలర్ సహాయంతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు మాట్లాడుతూ, వాహనాల సైలెన్సర్లను మార్పు చేసి అధిక శబ్దం వచ్చే విధంగా వినియోగించడం వల్ల శబ్ద కాలుష్యం పెరగడంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలు గుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వాహనదారులు తమ వాహనా ల్లో కంపెనీ అమర్చిన ఒరిజినల్ సైలెన్సర్లనే ఉపయోగిం చాలని, నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను మార్చి అధిక శబ్దం వచ్చేలా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు ట్రాఫిక్ ఏసిపి టి.సత్యనారాయణ ఇన్స్పెక్టర్లు సుజాత మరియు ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కిట్స్‌లో పరిశోధన నిధులపై సాంకేతిక సెమినార్



అక్షరశక్తి, హసన్‌పర్తి(వరంగల్): కాకతీయ ఇన్‌స్టిట్యూ ట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ వరంగల్ (కిట్స్‌డబ్ల్యూ) లో 'పరిశోధన నిధులను పొందడం.. అవకాశాలు, వ్యూహాలు' అనే అంశంపై సాంకేతిక సెమినార్ నిర్వ హించారు. డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కార్యా లయం ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ సెమినార్ హాల్‌లో కార్యక్రమం జరిగింది.

కిట్స్‌డబ్ల్యూలో అధ్యాపకుల పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు పరిశోధన ప్రాజెక్టుల అమలుకు ఎన్ఐటీ వరంగల్‌తో కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా సెమినార్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోకరెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఐటీ వరంగల్ డీన్ ఇంటర్నేషన ల్ రిలేషన్స్ అండ్ అలుమ్ని అఫైర్స్, ఏఐసీటీఈ విశిష్ట వృత్తి నిపుణులు, ఈసీఈలో హెచ్ఏజీ ప్రొఫెసర్ డా. టి. కిషోర్‌కుమార్ పరిశోధన ప్రాజెక్టుల పథకాలు, ఎన్ఐఆ ర్ఎఫ్ అంశాలు, పరిశోధన నిధులు పొందే మార్గాలపై అవగాహన కల్పించారు.

పరిశోధనకు ప్రణాళిక, ముందుచూపు, నిబద్ధత, పట్టు దల అవసరమని ఆయన అన్నారు. ప్రస్తుత పరిశోధన ధోరణులు, సాంకేతిక పురోగతులు, అంతర్ విభాగ సహకారంతో నిధులు పొందే అవకాశాలను వివరిం చారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోకరెడ్డి మాట్లాడుతూ నిరంతర అభ్యసనం, పరిశోధన సహకారం, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మారడం అవసరమన్నా రు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బి. రమాదేవి, డా. బి. జీవన్, డా. డబ్ల్యూ. గ్రేస్ శాంతి, డా. డి. ప్రభాకరాచారి, వివిధ విభాగాల డీన్లు, హెచ్ఓడీలు, 250 మందికి పైగా అధ్యాపకులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉద్యోగ సాధన



అక్షరశక్తి, హన్మకొండ: కష్టపడి చదివితేనే ఉద్యోగం సాధ్యమవుతుందని హన్మకొండ ఏసీపీ పి. నరసింహారావు అన్నారు. కాకతీయ యూనివర్సిటీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉచిత కోచింగ్ క్యాంపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఉద్యోగ సాధనకు షార్ట్‌కట్ మార్గాలు లేవన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసే మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హార్డ్‌వర్క్, పట్టుదల, నిరంతర సాధనే విజయానికి మార్గమని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాలు సాధించి కాకతీయ యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ నిరంతర సాధన, కృషితోనే లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. అంబేద్కర్ స్టడీస్ సెంటర్ ద్వారా విద్యార్థులకు అవగాహన, మార్గదర్శక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అంబేద్కర్ స్టడీస్ సెంటర్ జాయింట్ డైరెక్టర్ పుల్లా శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవకుడు రాజ్‌కుమార్‌కు ఘన సన్మానం



అక్షరశక్తి, దుగ్గొండి: వరంగల్ జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన శానబోయిన రాజ్‌కుమార్ ముదిరాజ్‌ను గిర్నిబావిలోని కనిష్క ఫంక్షన్ హాల్‌లో దుగ్గొండి మండల ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షులు పల్లె రమేష్ ముదిరాజ్ అధ్యక్ష తన జరిగిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు పొన్నం మొగిలి ముదిరాజ్ ము ఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మొగిలి మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు, వివిధ సేవా కార్యక్రమాల ద్వారా రాజ్‌కుమార్ సమాజా నికి సేవలందిస్తున్నారని, ఆయనకు లభించిన పదవి ముదిరాజ్ సమాజానికి గర్వకారణమన్నారు. వర్షాభావంతో ఉపాధి కోల్పోతున్న మత్స్యకార కుటుం బాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ తనపై చూపిన అభిమానం, నమ్మకాన్ని వమ్ము చేయకుండా భవిష్యత్తులో సమాజ సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు, మత్స్య సహకార సంఘాల ప్రతినిధులు, వివిధ గ్రామాల కుల పెద్దలు పాల్గొన్నారు.


ఘనంగా గణేష్ శోభాయాత్ర

అక్షరశక్తి, వరంగల్: ద్వారకాపురి కాలనీ ప్రకాశ్‌రెడ్డిపేటలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయక నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించా రు. మహిళలు, పిల్లలు, కమిటీ సభ్యులు కోలాటాలు, నృత్యాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. శోభాయాత్రలో టీఆర్ఎస్ మహబూబాబాద్ పార్లమెంట్ ఇన్‌చా ర్జి, గణేష్ నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు డా. బోడ అనిల్ కుమార్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్ నాయక్ మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో ఉత్స వాలను విజయవంతంగా నిర్వహించిన కమిటీ సభ్యులను అభినందించారు. కాలనీ కుటుంబాల మధ్య ఐక్యత, ప్రేమానురాగాలు పెంపొందేలా ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, విగ్రహ దాత సమ్మిరెడ్డి, రాజేందర్ రెడ్డి, హరిబాబు, వినయ్ భాస్కర్ రెడ్డి, నారా చంద్, సురేష్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



GUEST COLUMN

గిరిజన హక్కులు: చట్టం నుంచి చైతన్యం వరకు



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

భారతదేశంలో గిరిజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను కేవలం పేదరికం, వెనుకబాటుతనం లేదా ప్రభుత్వ సంక్షేమ పథకాల కొరతగా మాత్రమే చూడటం సరైంది కాదు. ఇది ప్రధానంగా హక్కులు, భూమి, సహజ వనరులు, స్వయం పాలన, సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవితానికి సంబంధించిన ప్రశ్న. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244, ఐదవ షెడ్యూల్, ఆర్టికల్ 46, ఆర్టికల్ 338ఏ వంటి నిబంధనలతో పాటు పంచాయతీలను షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరించే చట్టం–1996 (పీసా), అటవీ హక్కుల చట్టం–2006 వంటి చట్టాలు గిరిజనులకు ప్రత్యేక రక్షణ కల్పిస్తున్నాయి. తెలంగాణలో షెడ్యూల్డ్ ప్రాంతాలు కూడా ఐదవ షెడ్యూల్ పరిధిలో ఉన్నాయి.

అయితే చట్టపరమైన రక్షణకు మొదటి పరీక్ష భూమి హక్కు. తరతరాలుగా సాగుచేసుకొంటున్నప్పటికీ భూమికి పత్రాలు లేకపోవడం, అటవీ భూమి–రెవెన్యూ భూమి రికార్డుల్లో తేడాలు ఉండటం, భూమి ఆక్రమణలు, మధ్యవర్తుల మోసాలు, ప్రాజెక్టులు లేదా ఇతర అభివృద్ధి పనుల కోసం గిరిజనుల భూసేకరణ వంటి కారణాలతో గిరిజన కుటుంబాలు భూమిని కోల్పోయే ప్రమాదం ఏర్పడుతూ వస్తుంది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజన భూముల బదలాయింపుపై ప్రత్యేక రక్షణలు ఉన్నప్పటికీ, రికార్డుల లోపాలు, వాటి అమలులో బలహీనతలు సమస్యను పెంచుతూ పోతున్నాయి. కాబట్టి ప్రతి గిరిజన కుటుంబానికి భూమి సర్వే, హక్కుపత్రం, పహాణీ/ఆర్ఓఆర్ వంటి రికార్డుల డిజిటలైజేషన్, గ్రామస్థాయిలో పారదర్శక ధృవీకరణ అవసరం.

పోడు వ్యవసాయం సమస్యను కూడా కేవలం "అక్రమ సాగు"గా చూడకూడదు. అటవీ ప్రాంతాల్లో జీవనాధారంగా తరతరాలుగా సాగుచేసిన భూములపై హక్కులను గుర్తించేందుకు అటవీ హక్కుల చట్టం ప్రత్యేక విధానాన్ని కల్పించింది. వ్యక్తిగత సాగు హక్కులతో పాటు సామూహిక మేత, చేపల వేట, నీటి వనరుల వినియోగం, చిన్న అటవీ ఉత్పత్తులపై హక్కులు, సముదాయ అటవీ వనరులను సంరక్షించే హక్కులను కూడా చట్టం గుర్తిస్తుంది.

తెలంగాణలో ఈ సమస్య ఎంత పెద్దదో 2025 డిసెంబరు 31 నాటి అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన వివరాల ప్రకారం, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, మహబూబాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్ వంటి జిల్లాల్లో లక్షల సంఖ్యలో వ్యక్తిగత, సామూహిక అటవీ హక్కుల దావాలు నమోదయ్యాయి; అదే సమయంలో అనేక దావాలు తిరస్కరించబడ్డాయి లేదా పెండింగ్‌లో ఉన్నాయి. అందువల్ల తిరస్కరణకు కారణాలను గిరిజన కుటుంబానికి స్థానిక భాషలో లిఖితపూర్వకంగా తెలియజేయడం, అప్పీల్ అవకాశాన్ని వివరించడం, పెండింగ్ దావాలకు కాలపరిమితిలో పరిష్కారం ఇవ్వడం అత్యవసరం.



ఇక్కడ గ్రామసభ పాత్ర అత్యంత కీలకం. పీసా, అటవీ హక్కుల చట్టాల ఉద్దేశ్యం గిరిజనులను ప్రభుత్వ నిర్ణయాల లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా నిర్ణయ ప్రక్రియలో భాగస్వాములుగా చూడటం. భూమి, అడవి వనరులు, అభివృద్ధి ప్రాజెక్టులు, పునరావాసం, సంప్రదాయ వనరుల వినియోగం వంటి అంశాల్లో గ్రామసభను కేవలం సమావేశం నిర్వహించే యంత్రాంగంగా మార్చితే స్వయం పాలన సారాంశమే దెబ్బతింటుంది. మహిళలు, యువత, చిన్న పల్లెలు, దూరపు గూడేలకు చెందిన ప్రజల పూర్తి భాగస్వామ్యంతో గ్రామసభలు జరగాలి.

అటవీ వనరులపై హక్కు మరో ముఖ్యమైన అంశం. వెదురు, తేనె, తునికాకు, లక్క, ఔషధ మొక్కలు, వేర్లు, కందమూలాలు వంటి చిన్న అటవీ ఉత్పత్తులు అనేక గిరిజన కుటుంబాలకు ఆదాయ వనరులు. చట్టం వీటిపై హక్కులను గుర్తించినప్పటికీ, మార్కెట్‌కు ప్రత్యక్ష ప్రవేశం లేకపోవడం, మధ్యవర్తుల ఆధిపత్యం, నిల్వ–రవాణా సమస్యలు ఆదాయాన్ని తగ్గించవచ్చు. గ్రామస్థాయి సహకార సంఘాలు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, శీతల నిల్వలు, బ్రాండింగ్, నేరుగా మార్కెటింగ్ వంటి చర్యలు అవసరం.

విద్యలో తెలంగాణ ఇప్పటికే గిరిజన సంక్షేమ గురుకులాల ద్వారా పెద్ద వ్యవస్థను నిర్మించింది. 2026లో తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ 165 విద్యాసంస్థల్లో దాదాపు 79,810 మంది విద్యార్థులకు సేవలందిస్తున్నట్లు అధికారిక సమాచారం చెబుతోంది. అయితే పాఠశాలల సంఖ్య పెరగడమే సరిపోదు. దూర ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కొరత, మాతృభాషలో ప్రాథమిక విద్య, డిజిటల్ సౌకర్యాలు, ఉన్నత విద్యకు మార్గదర్శకత్వం, బాలికల భద్రత, డ్రాప్‌అవుట్ వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలి. తెలంగాణ గిరిజన జనాభా 2011 జనగణన ప్రకారం సుమారు 31.78 లక్షలు; అప్పుడు ఎస్టీ అక్షరాస్యత 49.51 శాతంగా నమోదైంది.

వైద్యం, పోషణ విషయంలో దూరప్రాంత గూడేలకు మొబైల్ వైద్య బృందాలు, టెలిమెడిసిన్, గర్భిణులు–శిశువులకు ప్రత్యేక పర్యవేక్షణ, సికిల్ సెల్ వ్యాధి స్క్రీనింగ్, తాగునీరు–పారిశుధ్యం వంటి సేవలు చేరాలి. పాఠశాలలు, ఆసుపత్రులు ఉన్నాయని చెప్పడం కంటే అవి పనిచేస్తున్నాయా? అవసరమైన వైద్య సిబ్బంది, మందులు, అంబులెన్స్, పరీక్షా సదుపాయాలు ఉన్నాయా? అన్నదే అసలు ప్రమాణం.

ఉపాధి, జీవనోపాధి విషయంలో ప్రభుత్వ ఉద్యోగ రిజర్వేషన్లతో పాటు భూమి ఆధారిత ఉపాధి, అటవీ ఉత్పత్తుల విలువ పెంపు, వ్యవసాయ ప్రాసెసింగ్, పశుపోషణ, చిన్న పరిశ్రమలు, నైపుణ్య శిక్షణ, గిరిజన యువత స్టార్టప్‌లు వంటి అవకాశాలను విస్తరించాలి. తెలంగాణ 2026–27 ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధుల్లో విద్యతో పాటు నైపుణ్య శిక్షణ, యువత పారిశ్రామికత, ఇంద్రా గిరి జల వికాసం వంటి కార్యక్రమాలకు కేటాయింపులు చేసింది. ఈ నిధుల వినియోగంపై గ్రామస్థాయిలో సామాజిక ఆడిట్ తప్పనిసరి చేయాలి.

రాజ్యాంగ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో ఆర్టికల్ 338ఏ కింద జాతీయ గిరిజన కమిషన్ ఏర్పాటు చేయబడింది. రాజ్యాంగంలోని ప్రత్యేక రక్షణలు, రిజర్వేషన్లు, ఐదవ షెడ్యూల్ వ్యవస్థ గిరిజనుల హక్కులను రక్షించేందుకు ఉద్దేశించబడ్డాయి. హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖలతో పాటు జిల్లా న్యాయ సేవా సంస్థ, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, జాతీయ/రాష్ట్ర గిరిజన కమిషన్ వంటి సంస్థలను ఆశ్రయించే విధానం ప్రజలకు తెలియాలి. కుల వివక్ష, హింస, భూమి ఆక్రమణ వంటి సందర్భాల్లో వర్తించే చట్టాలపై కూడా అవగాహన పెంచాలి.

సంస్కృతి పరిరక్షణ కూడా అభివృద్ధిలో భాగమే. గిరిజన భాషలు, పాటలు, నృత్యాలు, సంప్రదాయ జ్ఞానం, వనౌషధ పరిజ్ఞానం, పండుగలు, ఆచారాలు కేవలం పర్యాటక ప్రదర్శనలుగా మారకూడదు. స్థానిక భాషల్లో పాఠ్యాంశాలు, డిజిటల్ ఆర్కైవ్స్, యువత ద్వారా సాంస్కృతిక డాక్యుమెంటేషన్, సంప్రదాయ జ్ఞానానికి మేధో సంపత్తి రక్షణ అవసరం.

కేంద్ర ప్రభుత్వం చేయాల్సింది చట్టాల మధ్య సమన్వయం, రాష్ట్రాలకు తగిన నిధులు, అటవీ హక్కుల అమలుపై స్వతంత్ర పర్యవేక్షణ, ఐదవ షెడ్యూల్–పీసా అమలుకు స్పష్టమైన మార్గదర్శకాలు, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వడం. ప్రస్తుతం కేంద్ర స్థాయిలో 2026–27లో 41 మంత్రిత్వ శాఖలు/శాఖల పరిధిలో 210 పథకాలకు ఎస్టీ భాగం కింద బడ్జెట్ కేటాయింపులు ఉన్నట్లు అధికారిక పర్యవేక్షణ వ్యవస్థ చూపుతోంది. అయితే కేటాయింపుకంటే ఖర్చు, ఫలితాలు, లబ్ధిదారుల చేరిక ముఖ్యమైనవి.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గిరిజన కుటుంబానికి "హక్కుల పుస్తకం" అందించి, భూమి, అటవీ హక్కు, రేషన్, విద్య, ఆరోగ్యం, ఉపాధి, రిజర్వేషన్, పింఛన్, న్యాయ సహాయం వంటి హక్కుల వివరాలను స్థానిక భాషలో అందించాలి. ప్రతి మండలంలో గిరిజన న్యాయ సహాయ కేంద్రం, భూమి రికార్డు సహాయ కేంద్రం ఏర్పాటు చేయాలి. గ్రామసభ తీర్మానాలను డిజిటల్‌గా నమోదు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

చివరగా గిరిజన యువత తమ హక్కులను తెలుసుకోవడం అత్యంత అవసరం. రాజ్యాంగం, ఐదవ షెడ్యూల్, పీసా, అటవీ హక్కుల చట్టం, ఎస్సీ–ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం, సమాచార హక్కు చట్టం వంటి వాటిపై గ్రామస్థాయి అధ్యయన బృందాలు ఏర్పాటు చేసుకోవాలి. భూమి పత్రాలు, గ్రామసభ తీర్మానాలు, అటవీ హక్కుల దరఖాస్తులు, ప్రభుత్వ పథకాల వివరాలను డిజిటల్‌గా భద్రపరచాలి. సమస్య వచ్చినప్పుడు వ్యక్తిగతంగా కాకుండా ఆధారాలతో, చట్టబద్ధమైన మార్గాల్లో సామూహికంగా ముందుకు రావాలి.

గిరిజనుల అభివృద్ధి అంటే వారిని వారి భూమి, అడవి, సంస్కృతి నుంచి దూరం చేసి ప్రధాన స్రవంతిలో కలపడం కాదు. వారి హక్కులను కాపాడుతూ, వారి నిర్ణయాధికారాన్ని గౌరవిస్తూ, ఆధునిక విద్య–వైద్యం–సాంకేతికత–ఉపాధి అవకాశాలను వారి చేతుల్లో పెట్టడమే నిజమైన అభివృద్ధి. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు కాగితంపై ఉండకుండా గ్రామసభలో, పాలంలో, అడవిలో, పాఠశాలలో, ఆసుపత్రిలో, ఉద్యోగంలో కనిపించినప్పుడే సామాజిక న్యాయం సార్థకమవుతుంది.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.